

కామేశ్వరీదేవికి వెండిపూల హారం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవికి నంద్యాల జిల్లా వీరారెడ్డిపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు మంగళవారం వెండిపూల హారాన్ని బహూకరించారు.



ఊరంతా వేడుక

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దసరా సంబరాలు మిన్నంటాయి. విజయదశమి వేడుకల సందర్భంగా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. శాస్త్రోక్తంగా శమీ వృక్ష పూజలు చేపట్టారు. – 8లో...



భారీ అగ్ని ప్రమాదం

ఆదోని పట్టణంలో ఓ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దాదాపు రూ. 50 లక్షల దూదిబేళ్లు మంటల్లో దగ్ధమయ్యాయి. – 8లో...

న్యూస్‌రీల్

అన్నప్రసాద వితరణకు విరాళం



ఆదోనికి చెందిన దాతలకు లడ్డూప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తు న్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం పలువురు దాతలు విరాళాలను అందజేశారు. గుంటూరుకు చెందిన డి.దుర్గాబాయ్, కేపీ రాజ్‌కుమార్ రూ.1,00,101, ఆదోనికి చెందిన బొమ్మన చంద్ర శేఖర్‌రెడ్డి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. దాతలు విరాళాల కేంద్రంలోని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

దసరా తిరుగు ప్రయాణానికి 64 ప్రత్యేక బస్సులు

కర్నూలు(రాజ్‌విహార్): దసరా పండగ అనంతరం ఆయా ప్రాంతాల నుంచి తిరిగి వెళ్లే వారి కోసం 64 ప్రత్యేక బస్సులు నడపనునట్లు జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి టి. వెంకటరామం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ అనంతరం తిరుగు ప్రయాణాల కోసం ఈ బస్సులు తిప్పుతున్నామని, ప్రత్యేక బస్సులు అయినప్పటికీ వీటిలో సాధారణ చార్జీలే ఉంటాయని వెల్లడించారు. మంగళవారం హైదరాబాదు, బెంగళూరు, తిరుపతి, విజయవాడ, చెన్నై తదితర దూర ప్రాంతాలకు 17 బస్సులు పంపగా, బుధ, గురు, ఆదివారాల్లో మరో 47 బస్సులు పంపనున్నట్లు వెల్లడించారు. వీటిలో ముందస్తుగా టికెట్లు పొందేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన దసరా సెలవులు

- నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం

కర్నూలు సిటీ: దసరా సెలవులు మంగళవారంతో ముగిశాయి. దీంతో జిల్లాలోని అన్ని యాజమన్యాలకు చెందిన పాఠశాలలు బుధవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఉపాధ్యాయులందరూ తప్పక హాజరై తరగతి గదులు, పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ రంగారెడ్డి ఆదేశించారు.

అక్రమ రవాణాపై నిఘా పెంచండి

కర్నూలు: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా సరిహద్దు పంచలింగాల చెక్‌పోస్టులో ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఆకస్మికంగా చెక్‌పోస్టును తనిఖీ చేసి పరిశీలించారు. తెలంగాణ బార్డర్ చెక్‌పోస్టులలో ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు అనుమతులు లేకుండా సరఫరా చేసే ఇతర వస్తువులు అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. చెక్‌పోస్టుల్లోని పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు.

పోలియోను సమాజం నుంచి తరిమేద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పోలియో వల్ల చిన్నవయస్సులోనే శాశ్వత అంగవైకల్యం కలుగుతుందని, దీనిని సమాజం నుంచి నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ప్రపంచ పోలి యో నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పోలియో వ్యాక్సిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త జోనాస్ సాల్క్ జయంతి వేడుకలు జిల్లా వ్యాధినిరోధక టీకాల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మన దేశంలో 2011 సంవత్సరం తర్వాత పోలియో కేసు నమోదు కానందువల్ల 2014లో పోలియో రహిత భారత దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించిందన్నారు. పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో ఇంకా పోలియో కేసులు నమోదు అవుతున్నందున మన దేశంలో విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం కూడా జాతీయ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా పుట్టిన ప్రతి బిడ్డకు ఐదేళ్లలోపు 5 మోతాదులు పోలియో చుక్కలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డెమో ప్రమీలాదేవి, హెచ్‌ఈఈఓ శ్రీనివాసులుశెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ వ్యాక్సిన్ స్టోర్ ఇన్‌ఛార్జి రంగస్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

చూసిన కనులదే భాగ్యం

- నిజాలంకరణలో కటాక్షించిన భ్రమరాంబాదేవి
- శ్రీశైలంలో పూర్ణాహుతితో ముగిసిన దసరా నవరాత్రోత్సవాలు
- నేత్రానందభరితంగా స్వామి అమ్మవార్ల తెప్పోత్సవం



స్వామి, అమ్మవార్ల ఆలయ ప్రదక్షిణ



ఆలయ పుష్కరిణిలో స్వామి అమ్మవార్లకు తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



మల్లికార్జున గుండంలో చండీశ్వరుడికి త్రిశూల స్నానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో దసరా మహోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం భ్రమరాంబాదేవి నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నందివాహనసేవలో ఆది దంపతులు విహరించారు. ఆధ్యాత్మిక భరితంగా సాగిన ఉత్సవాలతో భక్తజనం పులకించిపోయింది. విజయదశమి రోజున స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. పూర్ణాహుతితో దసరా మహోత్సవాలు ముగిశాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీయాగ పూర్ణాహుతి, శ్రీ స్వామివారి యాగశాలలో రుద్రయాగపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కలశోద్వాసన కార్యక్రమాలు జరిపారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి అహుతిగా సమర్పించి పూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అనంతరం మల్లికాగుండం వద్ద చండీశ్వరస్వామివారికి త్రిశూల స్నానం జరిపించారు. కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, ఎం.విజయలక్ష్మి, మేరా జోత్ హనుమంత్‌నాయక్, ఓ.మధుసూదన్‌రెడ్డి, తన్నీరు ధర్మరాజు, అర్చకులు, అధ్యాపక, అర్చకస్వాములు, వేదపండితులు, ఆలయ ఏఈవో మోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లకు ఆలయ పుష్కరిణి వద్ద నేత్రానందభరితంగా తెప్పోత్సవం నిర్వహించారు.



హోమగుండానికి పూజాద్రవ్యాలను సమర్పిస్తున్న ఈఓ, వేదపండితులు

భ్రమరాంబాదేవి అలంకారంలో..

దసరా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని శ్రీభ్రమరాంబాదేవి స్వరూపంలో (నిజాలంకరణ) అలంకరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా విజయదశమి రోజున సాయంత్రం నందివాహన సేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను నందివాహనంపై ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగాణంలోని శమీ వృక్షానికి శాస్త్రోక్తంగా పూజాదికాలను జరిపారు. ఉత్సవాల్లో తొమ్మిదవ రోజు సోమవారం స్వామిఅమ్మవార్లకు సంప్రదాయబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ఉభయ దేవాలయాల అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర కార్మిక శాఖమంత్రి గుమ్మనూరు జయరాం దంపతులు, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దంపతులు, దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు పట్టు వస్త్రాలు, ఫలాలు, పసుపు, కుంకుమ తలపై పెట్టుకుని స్వామిఅమ్మవార్లకు సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదవ రోజైనా సోమవారం శ్రీభ్రమరాంబాదేవి సిద్ధిదాయిని అలంకారంలో భక్తులను కటాక్షించారు. అశ్వవాహనసేవలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి అర్చకులు, వేదపండితులు పూజాదికాలను నిర్వహించారు.



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న మంత్రి గుమ్మనూరు, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దంపతులు

సీఎంకు మల్లన్న ఆశీస్సులు ఉండాలని కోరుకున్నా..

రాష్ట్రంలో ప్రజలందరికీ సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. శ్రీశైలంలో దసరా మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామిఅమ్మవార్ల రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ శ్రీశైల మల్లన్నకు మూడు సార్లు పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం నాకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. శ్రీశైల మల్లన్న ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు మరింత మేలు చేసేలా సీఎం జగన్‌కు మంచి ఆయురారోగ్యాలు, శక్తిని బలాన్ని ప్రసాదించాలని స్వామిఅమ్మవా ర్లను కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మా ట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికి మేలు కలిగేలా పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు మల్లన్న ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

పోతిరెడ్డిపాడు నుంచి తగ్గిన నీటి సరఫరా

జూపాడుబంగ్లా: శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం తగ్గిపోవడంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి ఐదుగేట్ల ద్వారా 400 క్యూసెక్కుల నీళ్లు మాత్రమే ఎస్సార్‌ఎమ్సీకాల్వలోకి వెళ్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం డ్యామ్‌లో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో 846.10 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 845.10 అడుగుల నీటిమట్టం నమోదైనట్లు తెలిపారు. మరో మూడు రోజుల్లో పోతిరెడ్డిపాడు నుంచి నీటిసరఫరా నిలిచిపోయే అవకాశాలున్నాయన్నారు. ప్రస్తుతం విడుదలవుతున్న 400 క్యూసెక్కులను బానకచర్ల ఎస్సార్‌బీసీకి విడుదల చేస్తున్నారన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో 72.0497 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి చాలా రోజులుగా వరద ప్రవాహం నిలిచిపోయిన విషయం తెలిసిందే. అయితే జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు ప్రతి రోజూ నీటి విడుదల జరుగుతుండడంతో డ్యామ్‌లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. సోమవారం నుంచి మంగళవారం వరకు దిగువ ప్రాంతాలకు 5,273 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 1,550 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ఐదు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

పత్తి రైతుకు 'మద్దతు'

- నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం
- వర్చువల్ మోడ్‌లో ప్రారంభించనున్న మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. బుధవారం నుంచి పత్తి కొనుగోళ్ల ప్రక్రియను సీసీఐ చేపట్టనుంది. గుంటూరు నుంచి వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పత్తి కొనుగోళ్లను వర్చువల్ మోడ్‌లో ప్రారంభించనున్నారు. జిల్లాలో ఏడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదోనిలోని జయంత్, ఎన్‌డీబీఎల్, గూడూరు మండలం పెంచికలపాడులోని మంజిత్, ఎమ్మిగనూరులో మాధవ్, శివ, మురారీ, రాఘవేంద్ర కాటన్ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్‌లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కనీస మద్దతు ధర బన్ని/ బ్రహ్మ పింజ రకం (పొడువు పింజ రకం) పత్తి క్వింటాలుకు రూ.7,020 ఉంది. పొట్టి పింజ పత్తి మద్దతు ధర రూ.6,620 ఉంది.



ఆదోనిలో మార్కెట్‌కు వచ్చిన పత్తి బేళ్లు

జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పత్తి క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం పత్తికి ధరలు మెరుగ్గానే ఉన్నాయి. మార్కెట్‌లో పత్తి క్వింటాలు ధర కనిష్ఠంగా రూ.4,800, గరిష్ఠంగా రూ.7,500 వరకు ఉంటోంది. ధరలు మరింత తగ్గే ప్రమాదం ఉండటంతో రైతు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అండగా నిలుస్తోంది.

మద్దతు ధరతో విక్రయించుకోండి




గుంటూరు నుంచి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పత్తి కొనుగోళ్ల కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం ఆదోనిలో జరుగుతుంది. కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించే రైతులు పంట సాగుచేసినట్లు ఈ-క్రాప్‌లో నమోదై, ఈ-కేవైసీతో ధ్రువీకరించి ఉండాలి. తేమ శాతం 8 కంటే ఎక్కువగా ఉంటే ప్రతి ఒక్క శాతానికి రూ.55.50 ప్రకారం ధర తగ్గుతుంది. 12 శాతం కంటే తేమ ఉంటే కొనుగోలు చేసే అవకాశం ఉండదు. జిల్లా మొత్తంగా 11,26,288 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– నారాయణమూర్తి, ఏడీఎం, కర్నూలు జిల్లా

సామర్థ్యాల మదింపు... ప్రతిభకు గుర్తింపు

- ఎన్‌సీఈఆర్‌టీ నాస్ సర్వే టెస్ట్‌కు సన్నద్ధత
- 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య పరీక్ష
- నవంబర్ 3న 'సీస్' సర్వే
- నేటి నుంచి ప్రాక్టీస్ పరీక్షలు



కర్నూలు సిటీ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ లక్ష్యంగా విద్యా వ్యవస్థలో నిరంతర కసరత్తు జరుగుతోంది. విద్యార్థుల తరగతి వారీగా అభ్యాసన సామర్థ్యాలను సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సరికొత్త సంస్కరణలు తీసుకొస్తున్నాయి. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్ సర్వే) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నాస్ సర్వే టెస్ట్ నిర్వహిస్తుండగా, చివరిసారిగా 2021లో నిర్వహించారు. తిరిగి వచ్చే ఏడాదిలో నాస్ సర్వే నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ సర్వేకు ముందుగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ (సీస్) సర్వే టెస్ట్ మండల స్థాయిలో చేపట్టనున్నారు. ఈ సర్వే వచ్చే నెల 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. జిల్లాలో 718 స్కూళ్లలో సీస్ సర్వే నిర్వహించనున్నారు. ఈ స్కూళ్లలో 3,6,9 తరగతులు చదువుతున్న విద్యార్థులు 31,012 మంది ఉన్నారు. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్‌పై, 6వ తరగతికి 5వ తరగతి, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్షలు నిర్వహించనున్నారు. 3, 6 తరగతులకు లాంగ్వేజ్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులలో 40 ప్రశ్నలు, 60 నిమిషాలలోను, 9వ తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో 60 ప్రశ్నలు, 90 నిమిషాల్లో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్ష ఫలితాల ఆధారంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. ఇందులో భాగంగా బుధవారం నుంచి ప్రాక్టీస్ పరీక్షలు నిర్వహించారు.


ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు

క్షేత్ర స్థాయిలో పరీక్షలు నిర్వహించేందుకు ఆయా మండలాలలకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఇంజినీరింగ్, డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులను విద్యాశాఖ ఎంపిక చేసింది. వీరికి పరీక్ష ఎలా నిర్వహించాలి అనే అంశంపై డీఆర్‌సీలకు, డీఈఓ, జిల్లా సాధారణ పరీక్షల విభాగం కార్యదర్శి, ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులకు విజయవాడలో శిక్షణ ఇచ్చారు. వీరు జిల్లా స్థాయిలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో మొత్తం 11,328 మందిని ఎంపిక చేశారు. 53 మంది కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించనున్నారు. సీస్ పరీక్షల పూర్తి స్థాయిలో ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థుల పర్యవేక్షణలో జరుగనుంది. పరీక్షల పక్రియను డీఈఓ, డీసీఈబీ సెక్రటరీ, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పరిశీలిస్తారు. మండల స్థాయిలో మండల విద్యాధికారులు-1, మండల విద్యాధికారులు-2లతో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వ్యవహరిస్తారు. నాస్ పరీక్షకు ముందుగా ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ప్రాక్టీస్ పరీక్షల ద్వారా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయనున్నారు. దీని వల్ల నాస్ సర్వే పరీక్షలు సమర్థవంతంగా రాసేందుకు అవకాశం ఉంటుందనే సీస్ సర్వే పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో నాస్ సర్వే 3, 5, 8 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించే వారు, కానీ ఈ ఏడాది 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ ఎంపిక చేసిన స్కూళ్లలో మాత్రమే ఓఎంఆర్ షీటు విధానంలోనే ఈ పరీక్షలు జరుగుతాయి.

అకడమిక్ స్టాండర్డ్స్‌అంచనా కోసం

పాఠశాల స్థాయిలో అకడమిక్ స్టాండర్డ్స్‌ను అంచనా వేసేందుకు ఎన్‌సీఈఆర్‌టీ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహిస్తుంది. దీనికి ముందుగానే ఎస్‌సీఈఆర్‌టీ స్టేట్ అచీవ్‌మెంట్ ఎడ్యుకేషన్ సర్వే (సీస్) కోసం వచ్చే నెల 3వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు దసరా సెలవుల తరువాత ప్రతి రోజు ప్రాక్టిస్ కోసం ఎంపిక చేసిన జిల్లాలో 718 స్కూళ్లకు చెందిన 3,6,9 తరగతులకు చెందిన 31,012 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు.

– నాగరాజు, డీసీఈబీ ఇన్‌చార్జ్ సెక్రటరీ



క్లుప్తంగా

విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలవారి బిల్లులు 100 శాతం రాబట్టాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. దీని పై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకొని లక్ష్యం చేరాలన్నారు. విద్యుత్ అంతరాయం, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి పునరుద్ధరించాలని చెప్పారు.

వృద్ధుడి నేత్రదానం

కర్నూలు(హాస్పిటల్): తన మరణానంతరం ఓ వృద్ధుడు చేసిన నేత్రదానం ఇద్దరికి చూపు ప్రసాదించనుంది. నగరంలోని కల్లూరు ఎస్టేట్‌లో నివాసముంటున్న కృష్ణమూర్తి(72) సోమవారం మరణించారు. అతని కోరిక మేరకు కుటుంబసభ్యులు నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చి విషయాన్ని కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఐ బ్యాంక్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఐ బ్యాంక్ సిబ్బంది అక్కడికి వెళ్లి నేత్రాలను సేకరించారు. ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి చూపు ప్రసాదించినట్లు అవుతుందని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ. గోవిందరెడ్డి సూచించారు.

అంతర్‌జిల్లా దొంగపై పీడీ యాక్ట్ నమోదు

శిరివెళ్ల: మహానంది మండలం బుచ్చమ్మతోటకు చెందిన నల్లబోతుల నాగప్ప అలియాస్ శివారెడ్డి, రాజు అనే అంతర్ జిల్లా దొంగపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. నాగప్ప ఇప్పటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు అనంతపురం, వైఎస్ఆర్, ప్రకాశం జిల్లాల్లోని 100 ఇళ్లలో, 30 ఆలయాల్లో చోరీలు చేశారు. కొంత కాలంగా శిరివెళ్ల మండలంలోని పల దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే 12 చోరీ కేసుల్లో నేరం రుజువు అయి జైలుకెళ్లి వచ్చాడు. అయినా మార్పు రాకపోవడంతో కలెక్టర్ ఆమోదంతో దొంగపై పీడీ యాక్ట్ నమోదు చేసి మంగళవారం కడప సెంట్రల్ జైల్‌కు తరలించినట్లు శిరివెళ్ల ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



షేక్ రేష్మ (ఫైల్)

కర్నూలు : కల్లూరు ఎస్టేట్‌లోని జీఎస్‌ఎస్ కాలనీలో నివాసముంటున్న రహంతుల్లా భార్య షేక్ రేష్మా (22) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నంద్యాల జిల్లా డోన్ పట్టణం శ్రీనివాసనగర్‌కు చెందిన నూర్ అహ్మద్, మున్ని దంపతులకు ముగ్గురు కూతుర్లు సంతానం. పెద్ద కూతురు షేక్ రేష్మాను కల్లూరు ఎస్టేట్‌లో నివాసముంటున్న రహంతుల్లాకు ఇచ్చి గత ఏడాది అక్టోబర్‌లో వివాహం జరిపించారు. పెళ్లి సందర్భంగా రూ.4 లక్షలు కట్నం, 20 తులాల బంగారం, ఇతర వస్తువులు కానుకలుగా ఇచ్చారు. భర్త రహంతుల్లా హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. భార్యను తల్లి దగ్గర ఉంచి వారానికి ఒకసారి కల్లూరుకు వచ్చి వెళ్లేవాడు. కొన్నాళ్లు సంసారం సాఫీగా సాగింది. చిన్నచిన్న కారణాలు చూపి అత్త ఫాతిమా, ఆడపడుచు ముస్కాన్, ఆమె భర్త జావెద్ వేధింపులకు గురిచేస్తున్నారని తల్లిదండ్రులకు చెప్పుకుని రేష్మ బాధ పడేది. ఇటీవల బట్టలు పెట్టినప్పుడు మర్యాద ఇవ్వలేదని భర్త వేధిస్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పుకోవడంతో వారు పంచాయితీ పెట్టి పెద్ద మనుషుల సమక్షంలో సర్దిచెప్పారు. అయినప్పటికీ వేధింపులు తగ్గకపోవడంతో సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు కనుగొని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. భర్తతో పాటు అత్త, ఆడపడుచు, ఆమె భర్త జావిద్‌ల వేధింపులు తట్టుకోలేకనే తన కూతురు ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి నూర్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీశైలం.. నిజాలంకరణలో శ్రీభ్రమరాంబాదేవి



శ్రీశైలం..నందివాహనంపై స్వామి అమ్మవార్లు



అహోబిలం.. శమీ వృక్ష మహోత్సవంలో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు



కోడుమూరు.. ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లెలాంబాదేవి



మంత్రాలయం. ప్రహ్లాదరాయులను పూజిస్తున్న పీఠాధిపతి సుభుధేంద్రతీర్థులు

ఊరంతా వేడుక

- అంబరాన్నంటిన దసరా సంబరాలు
- భక్తి శ్రద్ధలతో శమీ వృక్ష పూజలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సోమవారం దసరా సంబరాలు అంబరాన్నంటాయి. దేవీ నవరాత్రుల్లో భాగంగా వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారికి దశమి రోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విశేషమైన శమీ వృక్షానికి పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా కర్నూలు నగరంతో పాటు నంద్యాల, శ్రీశైలం, మహానంది, అహోబిలం, ఆదోని, నందవరం, మంత్రాలయం, డోన్, బేతంచెర్ల, నందికొట్కూరు, ఆత్మకూరు, పత్తికొండ, కల్లూరు, కోడుమూరు తదితర ప్రాంత్రాల్లో పల్లకీ సేవలు, రథోత్సవాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆత్మకూరులో పోలీసు అధికారులు సంప్రదాయ దుస్తుల్లో కనిపించగా, ఆదోనిలో రావణ కుంభకర్ణుల బొమ్మల దహనం, బేతంచెర్లలో బోనాల ఊరేగింపు, గుడేకల్‌లో యువత సాహస విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఎమ్మిగనూరు.. కందనాతి గ్రామంలో చెన్నకేశవస్వామి విగ్రహ మహోత్సవం



అహోబిలం.. స్వామి, అమ్మవార్ల వనమహోత్సవానికి ముస్తాబైన శమీ వృక్షం



బేతంచెర్ల.. వాసవీమాతకు సమర్పించేందుకు బోనాలు తీసుకెళ్తున్న తెలంగాణ మహిళలు



బేతంచెర్ల..గరుడవాహనంపై మద్దిలేటి నరసింహస్వామి ఊరేగింపు



ఎమ్మిగనూరు..గుడేకల్ గ్రామంలో యువకుల సాహస విన్యాసం



కోవెలకుంట్ల..వెండిరథంలో పూజలందుకుంటున్న వాసవీమాత



నంద్యాల.. గ్రామోత్సవంలో ఉత్సవ మూర్తులు



ఆత్మకూరు.. సంప్రదాయ దుస్తులు ధరించి ఆయుధ పూజలో పాల్గొన్న పోలీసు అధికారులు



ఆదోని.. పట్టణంలోని మునిసిపల్ మైదానంలో రావణకుంభకర్ణ దహనం



కర్నూలు.. ఓల్డ్‌సిటీలోని జమ్మిచెట్టు వద్ద విజయదశమి వేడుకల్లో భక్తజనం

శ్రీశైలం-2024 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం ప్రచురించిన 2024 సంవత్సరపు నూతన క్యాలెండర్లను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఆవిష్కరించారు. పెద్ద సైజ్ 12 షీట్ల క్యాలెండర్‌లో శ్రీ రత్న గర్భ గణపతి, మల్లికార్జున స్వామి, శ్రీ భ్రమరాంబాదేవి, శ్రీసహస్ర లింగేశ్వర స్వామి, కల్యాణమూర్తి, శ్రీఅన్నపూర్ణాదేవి అమ్మవారు, శ్రీరాజరాజేశ్వరిదేవి, శ్రీవీరభద్రస్వామి, శ్రీకొమారిదేవి అమ్మవారు, బయలు వీరభద్ర స్వామి, శ్రీశనగల బసవన్న స్వామివార్ల ఛాయాచిత్రాలను ముద్రించారు. టేబుల్‌క్యాలెండర్‌లో ఆయా దేవతామూర్తుల చిత్రాలను ప్రచురించారు. ఈ క్యాలెండర్‌లో పంచాంగ వివరాలను దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్రదైవజ్ఞ రూపొందించారు. కార్యక్రమంలో ధర్మకర్తలమండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తదితరులు

ఒకేఈతలో రెండు పెయ్య దూడలు

కర్నూలు(అగ్రికల్చర్): ఆవులు, బర్రెలకు ఒకే ఈతలో రెండు దూడలు పుట్టడం అరుదుగా జరుగుతుంది. లక్ష పశువుల్లో ఒకదానికి ఇలా పుట్టే అవకాశం ఉంది. ఆలూరు మండలం హులేబీడు గ్రామంలో బి.బసప్ప కుటుంబ సభ్యులకు చెందిన నాటు ఆవుకు ఒకే ఈతలో రెండు దూడలు పుట్టాయి. ఈ రెండు పెయ్య దూడలే కావడం విశేషం. గ్రామంలో మొదటిసారిగా ఆవుకు రెండు దూడలు పుట్టడంతో అనేక మంది వాటిని చూసేందుకు ఆసక్తి కనబరిచారు.



ఆవుకు పుట్టిన పెయ్య దూడలను చూపుతున్న బసప్ప కుటుంబ సభ్యులు

సెల్‌ఫోన్ రిపేరీ, సర్వీస్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులకు సెల్‌ఫోన్ రిపేరీ, సర్వీస్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. 30 రోజుల శిక్షణ కాలంలో 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు యువతకు ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు 63044 91236 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం



కారులో మృతి చెందిన అంబర్సన్



నుజునుజ్జు అయిన కారు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనం ముగించుకుని సొంత ఊరికి తిరుగు ప్రయాణం అయిన వారిని మృత్యువు వెంటాడింది. విజయదశమి రోజు ఆ కుటుంబంలో మరిచిపోలేని విషాదాన్ని నింపింది. మంత్రాలయం ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం కాంచీపురానికి చెందిన అంబర్సన్ తన కుటుంబ సభ్యులతో విజయదశమి సందర్భంగా ఆదివారం మంత్రాలయం వచ్చారు. సోమవారం ఉదయం గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుని స్వంత ఊరికి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామ శివారులో ఉన్న అగ్రిగోల్డ్ ప్లాట్స్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో అంబర్సన్ అక్కడిక్కడే మృతి చెందాడు. కారు నుజునుజ్జు కావడంతో కారులో ఇరుకున్న మిగిలిన నలుగురిని స్థానికుల సహాయంలో బయటకు లాగి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



ప్రమీలమ్మ(ఫైల్)

తుగ్గలి : రోడ్డు ప్రమాదంలో పెండేకల్లు ఎంపీటీసీ సభ్యుడు గిరిపోగుల పెద్ద రంగన్న భార్య ప్రమీలమ్మ (55) మృతి చెందారు. ఈనెల 17న పుట్టినిల్లు ప్యాపిలి మండలం ఉసేనాపురానికి భర్తతో కలిసి వెళుతుండగా మార్గ మధ్యలో రంగాపురం వద్ద బైక్ రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ప్రమీలమ్మ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఈనెల 22న మృతి చెందారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ప్రమీలమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ REGULAR/DISTANCE/DISCONTINUED/FAILURES/DIRECT FINAL YEAR: 10TH, 12TH, DIPLOMA, BTECH, MTECH, BA, BCOM, BSC, MA, MCOM, MSC, BSW, BLIC, ANITHESIA, B.B.A, B.C.A, BED, MPED, LLB, MLT, DMLT, OT, MPHW, MBA, MCA, AGBSC, PHD, 8686172989. [L-798860]

REAL ESTATE

PLOT FOR SALE

■ నెలసరి కంతులలో కర్నూలు-నంద్యాల రోడ్, తిప్పాయిపల్లె దగ్గర ఓపెన్ ప్లాటు కలవు. & ఓర్వకల్లు MRO ఆఫీస్ దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. సం.ప్ర: 99638 00814 [L-781062]

LEASE/ RENT

■ 80 X 60 FEET 11 CENTS SITE, KURNOOL - HYDERABAD road NH7, OPP. ASHOK LEYLAND SHOW ROOM. WE WILL CONSTRUCT THE BUILDING AS PER TENANT REQUIREMENTS. CONTACT 9849290476. [C-1187945]

LEASE

■ డా॥ హోటల్ లీజుకు ఇవ్వబడును. టీ, టిఫిన్, భోజనం, బిర్యాని మరియు చైనీస్. అడ్రస్: Opp: ITC, క్రిష్ణానగర్, కర్నూలు. సం.ప్ర: 77801 28823. [L-781063]

SERVICES

■ వ్యక్తిగత వ్యవసాయ భూములకు పర్సనల్ రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు మొదలగు వారికి ఆర్థిక సలహాలు మరియు సహాయం చేయబడును. సం.ప్ర: 9034053557 [T-181]

BUSINESS OFFER

■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 7015828102 [HA-788339]

WANTED

■ ప్రముఖ వి9 న్యూస్ ఛానల్‌లో పని చేయుటకు యాంకర్స్, సబ్‌ఎడిటర్లు, వీడియో ఎడిటర్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్, రిపోర్టర్స్ కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. సం.ప్ర: 9490959794. [L-781073]

■ కన్సల్టెన్సీ కాదు MP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ:15000-40000/-, ఫ్రీ రూమ్ + భోజనం. Hyd. ఫోన్ : 7995365999 [HA-751]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వంట/ఇంటి పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 20K, ఫోన్: 8977639662, 8977639663 [HA-765]

■ రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను. భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725

ఎంజీ మోటార్స్ కార్ల షోరూం ప్రారంభం



ఎంజీ కార్ల షోరూంను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): నగర శివారులోని మామిదాలపాడు వద్ద ఏర్పాటు చేసిన ప్రముఖ ఎంజీ మోటార్స్ కార్ల షోరూం మంగళవారం ప్రారంభమైంది. ఎంజీ సంస్థ డిప్యూటీ ఎండీ గౌరవ్ గుప్త, షోరూం అధినేత ఉదయ్‌కుమార్ రెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంజీ కార్ల షోరూం కర్నూలులో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అత్యాధునిక టెక్నాలజీ, ఫీచర్స్ ఉన్న ఎంజీ ఆస్టర్, హెక్టార్, గ్లోస్టర్, విద్యుత్ వాహనాలు షోరూంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో స్కంద ఇన్‌ఫ్రా ఎండీ సురేష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ నిధికి విరాళం



దాతలకు జ్ఞాపిక అందజేస్తున్న ఏఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ఏర్పాటు చేసిన గో సంరక్షణ నిధికి మంగళవారం బెంగళూరుకు చెందిన శేగు శ్రీకృష్ణ రూ.1,00,001 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని ఏఈఓ ఫణిధర ప్రసాద్‌కు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండు, జ్ఞాపికను అందజేశారు.

జిన్నింగ్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం





బూడిదైన దూదిబేళ్లను బయటకు తీస్తున్న హమాలీలు, మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న శ్రీ బసవేశ్వర జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. పత్తి జిన్నింగ్ జరుగుతుండగా అగ్గి రవ్వలు దూదిబేడలపై పడ్డాయి. గమనించిన సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో శ్రీ మాళమాల్లేశ్వర స్వామి కాటన్ ట్రేడర్స్ (ఆర్‌ఆర్‌జీ) యాజమాన్యం దూదిబేడలు కాలిపోయాయి. దాదాపు రూ.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆర్‌ఆర్‌జీ ప్రొప్రయిటర్ రవికుమార్‌గౌడ్ తెలిపారు. సకాలంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది రాకపోయి ఉంటే రూ. కోట్లలో నష్ట వాటిల్లేదని సిబ్బంది తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన వ్యక్తి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ శివారులోని ఎల్లమ్మ గుడి వెనుక చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు కృష్ణగిరి ఎస్‌ఐ సురేష్ సంఘటనా స్థలానికి చెరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు సుమారుగా 28 నుంచి 30ఏళ్ల మధ్య ఉంటుంది. ఒంటిపై మొలతాడు తప్ప ఎలాంటి దుస్తులు లేవు. కుడి వైపు ఛాతి కింద, పొట్టపై, ఎడమ వైపు భుజం పై నల్లటి మచ్చలు ఉన్నాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరిలించామని, మృతుడి వివరాలు తెలిస్తే సెల్: 9121101118కు తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు.